# COMMUNIST PARTY OF INDIA (MARXIST)

# ANDHRA PRADESH COMMITTEE

H.No. 27-28-12, CPI(M) State Committee Office
Yamalavari Street, Governor Pet, Vijayawada -2
☎ 0866 - 2577202, Fax: 0866 - 2577203
E-mail: cpimap@gmail.com


**ప్రచురణార్థం/ ప్రసారార్థం:** **విజయవాడ,**

**తేది : 30 నవంబర్, 2019.**

ప్రజలు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వానికి విజయవాడలో జరిగిన సిపిఐ(ఎం) రాష్ట్ర స్థాయి విస్తృత సమావేశం విజ్ఞప్తి చేసింది.

సిపిఐ(ఎం) రాష్ట్ర స్థాయి విస్తృత సమావేశం నవంబర్ 28, 29 తేదీలలో విజయవాడలో జరిగింది. ఈ సమావేశాలకు రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాలు, వివిధ ప్రజారంగాల నుండి 600 మంది హాజరయ్యారు.

ఈ సమావేశాలకు సి.హెచ్.నర్సింగరావు, సున్నం రాజయ్య, రాష్ట్ర కమిటీ సభ్యులు వి.వెంకటేశ్వర్లు, కె.లోకనాథం, వి.సావిత్రిగార్లు అధ్యక్షత వహించారు. పార్టీ పోలిట్‌బ్యూరో సభ్యులు బి.వి.రాఘవులు హాజరై జాతీయ, అంతర్జాతీయ పరిస్థితులను వివరించారు. కేంద్ర కమిటీ సభ్యులు వి.శ్రీనివాసరావు రాష్ట్ర రాజకీయ పరిస్థితులు, నిర్మాణ కర్తవ్యాలను వివరించారు. రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు తక్షణ కర్తవ్యాలను వివరించారు.

రెండు రోజులపాటు జరిగిన ఈ సమావేశాలు వివిధ అంశాలపై పలు తీర్మానాలు ఆమోదించాయి.

కేంద్ర ప్రభుత్వ కార్మిక, ఉద్యోగ వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా కేంద్ర కార్మిక సంఘాలు ఇచ్చిన జనవరి 8 దేశవ్యాప్త సమ్మెకు సమావేశం మద్దతు ప్రకటించింది. సమ్మెను జయప్రదం చేసేందుకు పూర్తి సహాయ సహకారాలు అందించాలని శ్రేణులను సమావేశం కోరింది. (ప్రత్యేక తీర్మానం జత చేయబడింది)

విభజన చట్టంలో హామీల అమలు, ప్రత్యేక హోదా తదితర సమస్యలపై రాష్ట్రం పట్ల బిజెపి కేంద్ర ప్రభుత్వ విద్రోహానికి నిరసనగా ఆయా జిల్లాలు, ప్రాంతాలలో డిసెంబరు 10 నుండి 20 తేదీలలో ధర్నాలు, దీక్షలు నిర్వహించాలని వామపక్షాలు ఇచ్చిన పిలుపును జయప్రదం చేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేసింది.

భారత కమ్యూనిస్టు ఉద్యమం శత వార్షికోత్సవాలను రాష్ట్రంలో పెద్దయెత్తున జయప్రదం చేయాలని పార్టీ శ్రేణులకు, వామపక్ష అభిమానులకు సమావేశం విజ్ఞప్తి చేసింది. (ప్రత్యేక తీర్మానం జతచేయబడింది)

రాష్ట్రంలో వివిధ పట్టణాలు నగరాలలో ఇళ్ళు, ఇళ్ళ స్థలాలు, పట్టాలు మొదలగు సమస్యలు అపరిష్కృతంగా ఉన్నాయి. క్రమబద్ధీకరణ కోసం విడుదల చేసిన జివో 463లో మార్పులు చేసి అందరికీ పట్టాలు ఇవ్వాలి. ఆగిపోయిన ఇళ్ళ నిర్మాణాలను వెంటనే ప్రారంభించాలి. ఇప్పటికే చాలాకాలంగా నివాసం వుంటున్న పేదలకు పట్టాలివ్వాలి. వీటిని పరిష్కరించేందుకు ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని సమావేశం విజ్ఞప్తి చేసింది.

రాష్ట్రంలోని కౌలు రైతులందరికీ భూయజమాని సంతకంతో నిమిత్తం లేకుండా రైతు భరోసా పథకాన్ని వర్తింపజేయాలని సమావేశం ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది.

ఇసుక రేట్లను తగ్గించేందుకు చర్యలు తీసుకోవాలని, ఇసుక కొరత వల్ల పనులు కోల్పోయిన నిర్మాణ కార్మికులందరికీ రూ.20 వేల చొప్పున పరిహారం ఇవ్వాలని సమావేశం డిమాండ్ చేసింది.

రాష్ట్రంలో 1 నుండి 5వ తరగతి వరకు పాఠశాలల్లో విద్యాబోధనలో తెలుగు, ఇంగ్లీషు మీడియంలను సమాంతరంగా కొనసాగించాలని, తెలుగు మీడియంను రద్దు చేయవద్దని సమావేశం ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది.

గత ప్రభుత్వం తరహాలోనే ఇళ్ళస్థలాల కొరకు ల్యాండ్ పూలింగ్ విధానాన్ని చేపట్టడం తగదు. ల్యాండ్ పూలింగ్ జివో 294ను రద్దు చేయాలని సమావేశం ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. 2013 భూసేకరణ చట్టానికి గత ప్రభుత్వం చేసిన సవరణలను ఉపసంహరించుకోవాలి.

ఉపాధి హామీ సమస్యలను పరిష్కరించాలని, ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీలలో దళిత ప్రజాసంఘాలకు ప్రాతినిధ్యం కల్పించాలని సమావేశం ప్రభుత్వాన్ని కోరింది.

మొదటి రోజు ఫ్రెడరిక్ ఏంగెల్సు 199వ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి బి.వి.రాఘవులు, జ్యోతిరావు పూలే 129వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి వి.శ్రీనివాసరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. రెండవ రోజు సిపిఐ(ఎం) కార్మికోద్యమ నాయకులు కా॥ నండూరి ప్రసాదరావు వర్ధంతి సందర్భంగా బి.వి.రాఘవులు, ఎం.ఏ.గఫూర్‌లు పూలదండలు వేసి నివాళులర్పించారు. సమావేశం తొలుత ఇటీవల మరణించిన డా॥ భాస్కరరావు, సి.రాఘవాచారి, కర్నాటి లక్ష్మీ నరసయ్య, హేమా పరిమి, గురుదాస్‌దాస్ గుప్తా, పి.ఎస్.కృష్ణన్ తదితరులకు సంతాపం ప్రకటించింది.

**(జె.ప్రభాకర్)**

ఆఫీసు కార్యదర్శి